

సాక్షి
బాపట్ల
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 51,019 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 51,019 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 6034 క్యూసెక్కులు వదిలారు. బ్యాంక్ కెనాల్‌కు 1526 క్యూసెక్కులు వదిలారు.



దుప్పట్లు పంపిణీ

తాడేపల్లిరూరల్: జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు మంగళవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వేణుగోపాల్ బాధ్యతల స్వీకారం

బాపట్ల: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా డాక్టర్ వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి బాపట్లకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉప్పలపాడు గణపతి లడ్డూ రూ.2.30 లక్షలు



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడులోని గణేష్ మండపంలో నిర్వహించిన వేలంలో లడ్డూ ధర రూ.2.30లక్షలు పలికింది. ఉప్పలపాడులోని లైబ్రరీ సెంటర్‌లో టీమ్ ఏకదంత ఆధ్వర్యంలో 17 సంవత్సరాలుగా మండపం ఏర్పాటుచేసి గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. మండపంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. 53 కిలోల లడ్డూకు వేలం నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంలో గ్రామానికి చెందిన యన్నం రాధాకృష్ణారెడ్డి రూ.2.30 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గ్రామంలో నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. డీజే, డప్పులతో సాగిన ఊరేగింపులో యువత, మహిళలు సందడి చేశారు. గంటావారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం పూర్తిచేశారు.

నేడు జాబ్ మేళా

తెనాలి అర్బన్: తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో దివీస్ లాబోరేటరీ, ఈక్విక్‌డైస్ అండ్ మౌల్డ్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ ఫిట్టర్, టర్నర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ తదితర కోర్సులు చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు ఫోను నెంబర్లు 90144 91772, 99598 28100లో సంప్రదించాలని సూచించారు.

రేపు సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టులకు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ -2 ఫార్మసిస్టులకు ఈ నెల 19న పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగాల్లో నియమిస్తామని ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆరుగురు గ్రేడ్-2 ఫార్మాసిస్టులు ప్రమోషన్ జాబితాలో ఉన్నారని, వీరికి 19వ తేదీన గుంటూరులోని ఆర్డీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. వీరు తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు.

20న సీనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం (ఆర్డీ) పరిధిలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఐదుగురికి ఈ నెల 20న కౌన్సెలింగ్ నిర్వహించి ఆఫీస్ సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ ఇవ్వనున్నట్లు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు ఈ కౌన్సెలింగ్‌కు ఆ రోజు ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

మొక్కలు విరివిగా నాటుదాం

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ గిరిప్రదక్షిణ రోడ్డులోని గిరి వన విహార్ నగర వనంలో మంగళవారం మొక్కలు నాటారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల సహకారంతో అటవీశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గిరి వన విహార్ స్థలంలో నాగమల్లి, రుద్రాక్ష, మారేడు, కదంబం, ఉసిరి, సింహాచలం తదితర మొక్కలు నాటినట్లు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థలు 749 మొక్కలను అటవీ శాఖకు అందజేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షణను చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఉమాధవ్, వినుకొండ రేంజ్ అధికారి మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి బాధితుడికీ సహాయం

- కృష్ణా వరదలతో రూ.708 కోట్లు నష్టం
- నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదించాం
- వరదలో మునిగిన ప్రతి కుటుంబానికీ రూ.8 వేలు సహాయం
- 40 వేల ఎకరాల వరి, 11 వేల ఎకరాల వాణిజ్య పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ
- పూర్తిగా కూలిన ఇంటికి రూ.1.30 లక్షల పరిహారం
- పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి రూ.6,500
- నాతోపాటు అధికారులు రేయింబవళ్లు పనిచేశారు
- అప్రమత్తంగా ఉన్నందునే కరకట్టకు ఐదు చోట్ల గండిపడకుండా ఆపగలిగాం
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కృష్ణానదికి వచ్చిన వరదతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. నష్టం వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామన్నారు. 51 వేల ఎకరాలలో వ్యవసాయ, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వేల సంఖ్యలో ఇళ్లు కూలి ప్రజలు గూడు కోల్పోయారన్నారు. రోడ్లు, సాగునీటి వనరులకు నష్టం వాటిల్లిందన్నారు. తనతోపాటు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల కృష్ణా కరకట్టకు పలుచోట్ల గండ్లు పడకుండా చూడగలిగామని, దీనివల్ల పెద్ద ప్రమాదమే తప్పిందన్నారు. ఇంతస్థాయిలో వరద వచ్చి 24 గ్రామాలు నీటమునిగినా ఒక్క ప్రాణనష్టం లేకుండా చూడగలగడం సంతృప్తినిచ్చిందన్నారు. ఏకంగా ముఖ్యమంత్రి నుంచి ప్రశంసలు అందుకున్న కలెక్టర్ జె.వెంకటమురళి వరద, అనంతర సహాయక చర్యలను సాక్షికి వివరించారు.

- వరదల్లో నీట మునిగిన ఒక్కో కుటుంబానికి వంటపాత్రలకు రూ.2,500, బట్టలకు రూ.2,500తో పాటు ఒక్కో కుటుంబం నుంచి ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు ఇద్దరికి చొప్పున(ఒక్కొక్కరికీ రూ. 300 ప్రకారం) 5 రోజుల పాటు రూ.మూడు వేలు ఇవ్వడం జరుగుతుంది. ఈ లెక్కన ప్రతి కుటుంబానికీ రూ .8 వేలు అందుతుంది. దీని ప్రకారం నీటమునిగిన 7,995 కుటుంబాలకు రూ.6.39 కోట్లు ప్రభుత్వం చెల్లించనుంది.
- వరదల వల్ల 40 వేల ఎకరాలల్లో వరి పంట, 11,270 ఎకరాల్లో అరటి, పసుపు, కంద, తమలపాకు, జామ తదితర పంటలు పాడయ్యాయి. వరికి ఎకరాకు రూ.6,800 ప్రకారం, వాణిజ్యపంటలకు రూ.6,800 నుంచి 10 వేల వరకూ ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది.
- వరదల వల్ల నీటమునిగి 91 గృహాలు పూర్తిగా కూలిపోగా, 494 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పూర్తిగా దెబ్బతిన్న కచ్చా ఇంటికి రూ.1.30 లక్షలు, పక్కా ఇంటికి రూ. 1.20 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న పక్కా ఇంటికి రూ.6,500, కచ్చా ఇంటికి రూ.4,000 చెల్లిస్తాం.
- 350 కోళ్లు, 34 గొర్రెలు, 24 ఆవులు, బర్రెలు చనిపోయాయి. కోడికి రూ.100, పశువుకు రూ.37,500, గొర్రెకు రూ.10 వేలు చొప్పున ఇస్తాం. దెబ్బతిన్న మోటారు బోటుకు రూ.20 వేలు, బోటుకు రూ.15 వేలు, డామేజి బోటుకు రూ.6 వేలు చెల్లిస్తాం. ఇసుక మేటలు తొలగించుకునేందుకు రైతులకు ఎకరాకు రూ.18 వేలు చెల్లిస్తాం.
- రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో రూ.ఏడు కోట్ల మేర రోడ్లు దెబ్బతినగా ఇరిగేషన్ పరిధిలో రూ.10 కోట్లు, రూ.1.27 కోట్ల మేర విద్యుత్ రంగానికి నష్టం జరిగింది. మొత్తంగా అన్ని శాఖల పరిధిలో వరదలవల్ల రూ.708 కోట్లు నష్టం వాటిల్లింది.
- ఎన్నడూ రాని విధంగా 11.40 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో అరవింద వారధి వద్ద కృష్ణా కరకట్ట గట్టు తెగింది. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో 24 గ్రామాలు నీట మునిగాయి. ప్రకాశం బ్యారేజి నుంచి ఐదు లక్షల క్యూసెక్కులు విడుదల చేయగానే లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశాం. నాతోపాటు అధికారులు గ్రామాల్లోనే ఉన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బందిని గ్రామాల్లోనే ఉంచి ప్రజలను అప్రమత్తం చేశాం. రోజూ వేల సంఖ్యలో ఇటుక బట్టీల వద్ద పనుల కోసం వెళ్లే వారిని వెళ్లకుండా ఆపాం.



- 13 పునరావాస కేంద్రాలు పెట్టి 9 వేల మందిని తరలించాం. మిగిలిన 21 వేల మంది గ్రామాల్లోనే ఉండిపోయారు. వారికి ఎప్పటికప్పుడు వరద పరిస్థితులు మైకులు, అధికారుల ద్వారా వివరించి ప్రాణనష్టం నివారించగలిగాం. దీంతో ముఖ్యమంత్రి అభినందించారు. నాతోపాటు అధికారులందరూ రేయింబవళ్లు పనిచేయడంతోపాటు స్థానిక ప్రజల సహకారంతో ఓలేరు, వెల్లటూరు, పెద్దపులివర్రు, రావి అనంతవరం, రాపుర్లంక ప్రాంతాల్లో కృష్ణా కరకట్ట తెగిపోకుండా కాపాడుకోగలిగాం.
- కొల్లూరు, వెల్లటూరు, దోనేపూడి, పెనుమూడి పాయింట్ల వద్ద 73 బోట్లు పెట్టి ప్రజలకు నిత్యం భోజనం, వాటర్ బాటిల్స్, బిస్కెట్స్, డెట్రా మిల్క్‌పాకెట్స్ మొదలైన ఆహారం అందించాం. వరద తగ్గగానే ప్రతి కుటుంబానికీ నిత్యావసరాలు అందజేశాం. రోడ్డు మార్గం పునరుద్ధరించాం. ఆ తర్వాత గ్రామాల రోడ్లు క్లీనింగ్, పారిశుద్ధ్య పనులు పూర్తిచేశాం. వరద నీరు తగ్గిన 4వ రోజునే 24గ్రామాలకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించాం. అనంతరం నష్టం అంచనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించాం.



వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి(ఫైల్)

ప్రకృతి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం


జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: ప్రకృతి పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పరిశుభ్రమైన భారతదేశాన్ని రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. బాపట్ల జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. గాంధీజీ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు పుష్పమాలలతో నివాళులర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర మిషన్ అమలులో ఉన్నందున పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలు, రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతి ఇవ్వాలని అన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో బాగా పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ, బీమా పథకాలను వర్తింపజేయాలన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల మనుషులకు ఎంతో నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతాయని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శివకృష్ణ, డి ఆర్‌డీఏ పీడీ వై పిచ్చిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నూతన గ్రేడ్లు..!

- శాఖకు చేరిన జనాభా, ఆదాయ వివరాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,183 పంచాయతీలు
- గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల నియామకం
- బదిలీలలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సూచనలు అమలు



పంచాయతీ కార్యాలయం

బెల్లంకొండ: గ్రామ పంచాయతీలకు త్వరలో నూతన గ్రేడ్లు రానున్నాయి. జనాభా, ఆదాయాన్ని అనుసరించి ఈ మార్పునకు కార్యాచరణ సిద్ధమైంది. పీఆర్ అండ్ ఆర్‌డీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాలోని ఈ వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ (సీపీఆర్)కు అధికారులు పంపారు. 2011 జనాభా, గత మూడు సంవత్సరాలుగా వస్తున్న తలసరి ఆదాయ వివరాలను అందజేశారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా మారని గ్రేడ్ల వ్యవహారంలో కదలిక రాబోతోంది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆదాయం ఉన్నా వ్యత్యాసం

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ గ్రేడ్‌లలో వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న గ్రేడ్లు రెండు దశాబ్దాల క్రితం నాటి ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రస్తుతం గ్రామాలలో జనాభా, ఆదాయం వివరాలలో వ్యత్యాసాలు వచ్చాయి. మున్సిపాలిటీల సమీపంలో ఉన్న పలు పంచాయతీలకు వివిధ రూపాల్లో ఆదాయ వనరులు కూడా పెరిగాయి. పలు రకాల టాక్స్‌ల ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తోంది. గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లోనూ మార్పులు ఉన్నా యి. కొందరు పనిభారం తగ్గించుకునేందుకు తక్కు వ గ్రేడ్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీలో పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదీ పరిస్థితి..

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా జిల్లా పంచాయతీ అధికారి వివరాల మేరకు... మొత్తం 1,183 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో రూ.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి(గ్రేడ్-1) 230, రూ.3 లక్షలు- రూ.5 లక్షలలోపు ఆదాయం కలిగినవి (గ్రేడ్-2) 129, రూ.లక్ష - రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (గ్రేడ్-3) 201 , రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం పొందుతున్నవి (గ్రేడ్-4) 195, గ్రేడ్-5 పంచాయతీలు 427 ఉన్నాయి. ఇక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గ్రేడ్ 1 కార్యదర్శులు 230 మంది, గ్రేడ్ 2 - 48, గ్రేడ్ 3 - 135, గ్రేడ్ 4 - 150, గ్రేడ్ 5 - 427 మంది కలిపి మొత్తం 990 మంది పనిచేస్తున్నారు.

ఆదాయం ఆధారంగా మార్పులు

కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీల గ్రేడ్లు మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా మారితే కార్యదర్శులకు తప్పనిసరిగా స్థానచలనం కలుగుతుంది. ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అర్హులైన కార్యదర్శులను నియమించే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంలో కచ్చితంగా నిబంధనలను అమలు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. కార్యదర్శి గ్రేడ్‌ని బట్టి నియమించాలని ఇటీవలే డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాలు విడుదలలో కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కచ్చితంగా గ్రేడ్లను అనుసరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ మొత్తం కొద్ది రోజుల్లోనే పూర్తి అవుతుందని చెబుతున్నారు.

వివరాలు అందజేశాం

పంచాయతీల వివరాలను కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ కోరడంతో జిల్లాకు సంబంధించినవి అందజేశాం. ఆయా గ్రామాల జనాభా, ఆదాయం వివరాలు అందులో పొందుపరిచాం. గ్రేడ్‌ల ఆధారంగానే ఇక నుంచి కార్యదర్శుల బదిలీలు జరిగే అవకాశం ఉంది. డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ నిబంధనలు కూడా అలాగే ఉన్నాయి. కొద్ది రోజుల్లోనే గ్రేడ్‌ల ప్రక్రియ పూర్తి అవుతుంది.

– శ్రీదేవి, జిల్లా పంచాయతీ అధికారి, గుంటూరు

యార్డుకు 47,720 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 47,720 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,418 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.18,500 వరకు పలికింది.

కాసులు కొట్టు.. ఖజానాలో పనిపట్టు !

- వృద్ధుల పింఛన్ నుంచి కాంట్రాక్ట్ బిల్లుల వరకు కమీషన్లు పెట్టి మరీ వసూళ్లు
- ఖజానాలో కుర్చీలాటతో బయటపడిన వివాదాలు
- డీడీ, ఆర్డీఓ విచారణ
- అందరి సీట్లు మార్చేసిన వైనం
- చీరాల ఖజానా ఉద్యోగుల తీరు ఇదీ

అవినీతి ఖజానా!



చీరాల ఉపఖజానా కార్యాలయం

చీరాల: పండుటాకులకు పింఛన్ కావాలన్నా.. పర్సంటేజీలు ముట్టజెప్పాల్సిందే.. ఉద్యోగులు జీతభత్యాలు చేతికి రావాలంటే చేతులు తడపాల్సిందే. కాంట్రాక్టర్ల బిల్లులు జేబుల్లోకి రావాలంటే ముందుగా వారి జేబులు నింపాల్సిందే. ఇందుకుగాను కుర్చీల కోసం సాగిన బేరసారాల దెబ్బకు ఖజానాలో జరుగుతున్న అక్రమాల గుట్టు రట్టయ్యింది. చివరకు చీరాల ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి, ఖజానా శాఖ డీడీలు విచారణ చేసి కుర్చీలు సర్దుబాటు చేసి వెళ్లారు.

ప్రతి నెలా రూ.30 కోట్ల బిల్లులు..

చీరాల ఉపఖజానా కార్యాలయ పరిధిలో చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు ఏడు వేల మంది వరకు ప్రతి నెలా అందిస్తుంటారు. ఇది కాకుండా ఈ ఆరు మండలాల్లో చేసిన వివిధ కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లులు కూడా ట్రెజరీ ద్వారానే జమకావున్నాయి. ఉపఖజానా కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారి, సీనియర్ అసిస్టెంట్లు ఇద్దరు, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, ఒప్పంద పద్ధతిలో మరో ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. ట్రెజరీ కార్యాలయం ద్వారా నెలకు ఉద్యోగుల జీతాలు, విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు రూ.30 కోట్లు విలువ చేసే బిల్లులు మంజూరు చేస్తుంటారు.

పర్సంటేజీలిస్తేనే ఫైలు కదిలేది..

ఉపఖజానా కార్యాలయంలో పనిచేసేది కూడా ప్రభుత్వ ఉద్యోగులే. వీరు చేసేది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారుల పింఛన్లు, ఉద్యోగులు టీఏ, డీఏ బిల్లులు మంజూరు చేయడంతో పాటుగా కాంట్రాక్టర్లుకు బిల్లులు ఆన్‌లైన్‌లో పాస్‌చేసి మంజూరు చేయిస్తారు. చీరాల ఎస్టీఓ కార్యాలయం పరిధిలోని ఆరు మండలాల్లో ఎవరైనా పని కావాలంటే కప్పం కట్టాల్సిందే. జీతాల బిల్లులకు ఒక రేటు, కాంట్రాక్టర్ల బిల్లులకు ఒక రేటు. పింఛన్‌దారుల పెండింగ్ బిల్లులకు ఒక రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. పనిని బట్టి పర్సంటేజీ 5 శాతం వసూలు చేస్తున్నారు. నెలకు రూ.30 కోట్లలో 5 శాతం కప్పం వసూలు చేస్తున్నారంటే ఏడాది ఎంత అక్రమార్జన చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

సుధిరామోదం ఉంటేనే..?!

చీరాల ఉపఖజానా కార్యాలయంలో ఉద్యోగులు అందరు ధనార్జనే ధ్యేయం తప్ప సత్వరంగా సేవలందించాలనే తపన మాత్రం ఉండదు. కుర్చీల కుమ్ములాట, పర్సంటేజీల లొల్లి, సిఫార్సు లేఖలతో ఒత్తిడి చేయడం తప్ప సమాయానికి వచ్చిన దాఖలాల్లేవు. ఈ కార్యాలయంలో పనిచేసే ఓ దిగువశ్రేణి అధికారే చక్రం తిప్పేది. ప్రతీ పనికి ఒక రేటు ప్రకారం వసూళ్లు చేసేది, చేయించేది. ఈ కార్యాలయం అంతా మహిళా ఉద్యోగులే ఉన్నప్పటికీ పనులు మాత్రం పైసలిస్తేనే.. ఈ కార్యాలయంలో ఏ పని చేయాలన్నా సుధీరామోదం ఉండాల్సిందే. ఆమె చెప్పిందే వేదంగా నడుస్తోందని కార్యాలయ ఉద్యోగులే చెబుతుంటారు. గత మూడేళ్ల నుంచి ఈ కార్యాలయాన్ని ఆమె అధీనంలోకి తెచ్చుకుని తాను చెప్పిందే చేసేలా పెత్తనం సాగించింది. కొన్నాళ్లు ఇన్‌చార్జి అధికారిగా కూడా పనిచేసింది. గతంలో ఒంగోలు ట్రెజరీలో ఎక్కువ కాలం, అద్దంకిలో రెండేళ్లపాటు ఆ అధికారిణి విధులు నిర్వహించారు. ఎంతటి ఫైలైనా, ఏ శాఖ ఫైలైనా చీరాల ట్రెజరీ నుంచి పాస్ అవ్వాలంటే ఆ అధికారిణి ఆమోదం ఉండాల్సిందేనని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

ఆఫీస్ ఆర్డర్ బేఖాతర్..

చీరాల ఉపఖజానా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఆఫీస్ ఆర్డర్‌ను బేఖాతరు చేస్తుంటారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వారికి అధికంగా బిల్లులు పాస్ చేసే సీట్లు కావాలని పట్టుబట్టి మరీ ఆ సీట్లే వేయించుకుంటారు. చీరాల ఎస్టీఓ ఆఫీస్ ఆర్డర్ ప్రకారం విధుల్లో మార్పు చేసినా వారు మాత్రం ఆదాయం వచ్చే సీట్లు దక్కలేదని కొద్దిరోజులు బిల్లుల మంజూరు చేయకుండా కాలయాపన చేశారు. అంతేగాక చీరాల ముఖ్య ప్రజాప్రతినిధిని కలిసి మీకు అనుకూలమైన మాకు బాగా అవసరమైన సీట్లు ఇవ్వకుండా, డబ్బులు రాని కుర్చీలు ఇస్తున్నారని ఈ ఉద్యోగులు ఆ నేత నుంచి సిఫార్సు లేఖలు తీసుకురావడం చర్చనీయమైంది. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు మాత్రం ఈ ఉద్యోగులు వలన బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో బిల్లులు పాస్ చేసేశాం..



చీరాల ఉపఖజానా కార్యాలయంలో బిల్లుల మంజూరులో జాప్యంపై ట్రెజరీ ఉన్నతాధికారులకు నివేదించాం. ఉద్యోగులకు పని విభజన చేస్తే ఒప్పుకోలేదు. దీంతో బిల్లుల మంజూరులో జాప్యం ఏర్పడింది. చీరాల కార్యాలయంలో ఆర్డీఓ, ఖజానా డీడీలు విచారించి ఉద్యోగులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించి ఉద్యోగులకు ఆఫీస్ ఆర్డర్ ద్వారా అందరి కుర్చీలను మార్చారు. నేను కొంతకాలంగా అనారోగ్యానికి గురై కొన్ని నెలలు సెలవులో ఉన్నాను.

– కె.భాగ్యలక్ష్మి, ఎస్టీఓ చీరాల

ఆర్డీఓ, ట్రెజరీ డీడీ విచారణతో బిల్లులకు మోక్షం..

చీరాల ఉపఖజనా కార్యాలయం ఉద్యోగులు ఆడిన కుర్చీలాట, ఆదాయం రాని కుర్చీల్లో పని చేసే ఇష్టం లేక పెన్‌డౌన్ చేసి బిల్లులు పాస్ చేయకపోవడంపై పలువురు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో చీరాల ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, ఖజానా డీడీలు చీరాల వచ్చి ట్రెజరీ ఉద్యోగులు పాస్ చేయని బిల్లులను త్వరగా మంజూరు చేయించారు. ఉద్యోగులు వ్యవహరించిన తీరుపై కలెక్టర్‌కు, ఖజానా శాఖ ఉన్నతాధికారులకు కూడా విచారణ రిపోర్టును అందించనున్నారు. పర్సంటేజీలు వచ్చే కుర్చీల కోసం విధులు ఆపిన సదరు ఉద్యోగులపై ప్రభుత్వం శాఖా పరమైన చర్యలు ఏం తీసుకుంటారో వేచి చూడాలి.

క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధికి పలు కోర్సుల్లో శిక్షణ

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్య కళాశాల కో–ఆర్డినేటర్ ఎం.బుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్(బైపీసీ),డిగ్రీ, డిప్లొమో, పీజీల్లో ఫిషరీస్ సబ్జెక్టు చదివిన 18–35 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 60 సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ ల్యాబ్ సూపర్‌వైజర్, ఆక్వాకల్చర్ టెక్నికల్ సూపర్‌వైజర్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 9346280289, 9988853335 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

14 మంది కానిస్టేబుళ్లు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో 14 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి రూరల్, తాడేపల్లి పీఎస్‌ల నుంచి ఎనిమిది మంది, మంగళగిరి టౌన్, పొన్నూరు రూరల్ పీఎస్‌ల నుంచి ఇద్దరు చొప్పున జిల్లాలోని వేర్వేరు పీఎస్‌లకు బదిలీ అయ్యారు. తెనాలి టూటౌన్ పీఎస్, కొత్తపేట పీఎస్ నుంచి ఒక్కొక్క కానిస్టేబుల్‌ను బదిలీ చేశారు.

ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

తొలిరోజు రెండు సెంచరీలు నమోదు



కె.నిఖిలేశ్వరరెడ్డి, 116 పరుగులు



శశాంక్ శ్రీవాత్స, 154 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్.కె.ఆర్.బి.ఆర్. క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలు సాధించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 368 పరుగులు సాధించింది. జట్టులోని శశాంక్ శ్రీవాత్స 162 బంతుల్లో 12 ఫోర్లు, 10 సిక్స్‌లతో 154 పరుగులు, కె.నిఖిలేశ్వరరెడ్డి 268 బంతుల్లో 15 ఫోర్లతో 116 పరుగులు సాధించారు. సెంట్రల్‌జోన్ బౌలర్ సుశాంత్‌నాయుడుకు 2వికెట్లు లభించాయి.

నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండల మిన్నెకల్లు గ్రామానికి చెందిన కెల్లంపల్లి ప్రతాప్ (40) వినాయక విగ్రహాన్ని కాల్వలో పడివేసే సమయంలో తాను కూడా కాల్వలో దూకాడు. ఈక్రమంలో కాల్వలోని నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగటంతో గల్లంతైనట్లు ఎస్సై తెలిపారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సారథ్యంలో గజ ఈతగాళ్ళు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు.

జగన్నాటక పాత్రధారి!

కళామతల్లి ముద్దుబిడ్డ జగన్నాథం యోహాన్

- తండ్రిని చూసి నాటకరంగంలోకి ప్రవేశం
- 200లకు పైగా నాటక ప్రదర్శనలు
- ప్రముఖ నటులతో కలసి పాత్రల పోషణ

మేదరమెట్ల: అతనికి నాటకం అంటే ప్రాణం. చిన్నతనం నుంచే నాటకరంగం మీద అభిరుచి పెంచుకున్నాడు. తన తండ్రి నుంచి వారసత్వాన్ని కొనసాగించి అందరి మన్ననలు పొందుతున్నాడు జగన్నాథం యోహాన్. చిన్నతనంలో తండ్రి నాటకాలు వేయడం చూసిన తాను కూడా నాటకాలు వేయాలనే కోరికను బలంగా మనసులో నాటుకున్నాడు. చిన్నతనంలోనే గ్రామాల్లో నిర్వహించే చిన్నపాటి నాటికలు, నాటకాలలో పలు పాత్రలు పోషించి గ్రామస్తుల మెప్పు పొందాడు. అదే స్ఫూర్తితో పెరిగి పెద్దవాడైన తరువాత నాటకల్లో సత్యహరిశ్చంద్రుడు, అర్జునుడు, భవానీశంకర్, అనాస్ వంటి పాత్రలను పోషిస్తూ రాష్ట్రం నలుమూలల 200 పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చారు.

హరిశ్చంద్ర పాత్రతో గుర్తింపు..

జగన్నాథం యోహాన్ కొరిశపాడు మండలం బొల్లవరప్పాడు (చలివేంద్ర) గ్రామవాసి. ఎంఏ, ఎల్ఎల్‌బీ చదివాడు. తన తండ్రి అయ్యన్న తన చిన్నతనంలో బొబ్బిలియుద్ధం నాటకంలో రంగరాయుడు పాత్రను ధరించగా అది చూసి తాను కూడా నాటకాలు వేయాలని ఆసక్తి పెంచుకున్నాడు. తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని, ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు నాటకాలు వేస్తూ వచ్చాడు. 1988లో డిగ్రీ చదువుతున్న సమయంలో గ్రామంలో సత్యహరిశ్చంద్ర నాటకం వేశాడు. అందులో తన నటనను చూసిన గ్రామస్తులు మెచ్చుకున్నారు. పలువురి ప్రోత్సాహంతో రెండు సంవత్సరాల పాటు సత్యహరిశ్చంద్ర ఫేమ్‌గా నటిస్తూ వచ్చాడు. తరువాత ఉద్యోగ రీత్యా పది సంవత్సరాల పాటు నాటకాలకు విరామం కలిగింది. పదేళ్ల విరామం తరువాత 2005లో తాను వేసే నాటకాన్ని క్యాసెట్ చేయాలనే ఆలోచనతో గ్రామస్తులతో కలసి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించాడు. ఆ నాటకం చూసిన చుట్టుపక్కన ఉన్న గ్రామాల వారు మెచ్చుకోవడంతో మళ్లీ నాటకరంగ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. ఆ వెనువెంటనే ఐదు నాటకాల్లో నటించేందుకు పలు గ్రామాలవారు అవకాశం ఇచ్చారు. అప్పటి నుంచి తన నటనా కౌశలంతో పలు వేషాలు వేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలిగాడు.



సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీనులో నటిస్తున్న యోహాన్



ఒంగోలులో జబర్దస్త్ అప్పారావు చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న యోహాన్ (ఫైల్)

పలు వేషాల్లో రాణింపు..

సత్యహరిశ్చంద్ర నాటకంలో ఒకటి, రెండు, నాలుగు సీన్లలో హరిశ్చంద్రునిగా, చింతామణి నాటకంలో భవానీ శంకర్‌గా, గయోపాఖ్యానం నాటకంలో అర్జునుడిగా శిలువధారి నాటకంలో అనాస్ వంటి పాత్రలు పోషించి నాటక రంగ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఒంగోలులో జబర్దస్త్ కళాకారుడు అప్పారావు చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. పలుచోట్ల ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

■ బాలనాగమ్మ నాటకంలో మాయల ఫకీర్ పాత్ర పోషించడం తన ఆకాంక్ష అని యోహాన్ తెలిపారు. నాటకరంగం క్షీణించిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వాలు కళాకారులకు సహకారం అందించి, కళను బతికించడం కోసం చర్యలు చేపట్టాలని జగన్నాథం యోహాన్ కోరారు.



చింతామణి నాటకంలో భవానీశంకర్ పాత్రలో..

వరద బాధితులకు జీఎంసీ-90 బ్యాచ్ అండ

500 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేసిన వైద్యబృందం



ఆముదార్లంక వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: వరద బాధితుల సహాయార్థం గుంటూరు మెడికల్ కళాశాల (జీఎంసీ) 1990 బ్యాచ్‌కి చెందిన వైద్య బృందం మంగళవారం భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెం, కృష్ణా జిల్లా ఆముదార్లంక, కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామాల్లో 500 కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. రూ.10 లక్షలు వ్యయం చేసే సరుకులను అందజేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని డాక్టర్ మల్లిఖార్జునరాజు తెలిపారు. విజయవాడ నక్కలరోడ్డులోని న్యూరాలజిస్ట్ పుష్పరాజ్ వైద్య సేవలు అందించేందుకు ముందుంటానని ప్రకటించారు. ఆముదార్లంక ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు వరదలో చిక్కుకున్న గ్రామాల దుస్థితిని గూర్చి తెలియజేయగా స్పందించి, ముందుకు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఉపాధ్యాయులు అనీల్ కుమార్, వెంకట రమణ, పున్నారావు, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండ లాగుడు పోటీలు



రెండు పళ్ల విభాగంలో బండ లాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. ప్రత్తిపాడులో నందమూరి తారకరామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం రెండు పళ్ల విభాగంలో పోటీలు నిర్వహించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, జిల్లాల నుంచి మొత్తం పది జతల గిత్తలు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన నల్లబోతు ప్రవీణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన ములకపల్లి సురేష్ సంధ్యల గిత్తలు 3,600 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన బోయిన నాగరాజు గిత్తలు 3,229.2 అడుగులు లాగి తృతీయ, నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామకృష్ణాపురానికి చెందిన నాగేంద్ర గిత్తలు 3,113.1 అడుగులు లాగి నాలుగో, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజియ్య చౌదరి గిత్తలు 3,073 అడుగులు లాగి ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులను టీడీపీ నాయకుల చేతుల మీదుగా నిర్వహణ కమిటీ సభ్యులు అందజేశారు. పోటీలను స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వీక్షించారు.

వరద బాధితులకు క్రెడాయ్ ఆర్థిక సాయం



కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి తదితరులు

నెహ్రూనగర్: క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.7 లక్షలు అందించారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులుకు క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్ రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాములు తదితరులు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి అండగా నిలిచిన క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌ను అభినందించారు. క్రెడాయ్ ఏపీ చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ ఇటీవల వానలు, వరదలకు విజయవాడ ఎంతో నష్టపోయిందన్నారు. చాలా మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గుంటూరు చాప్టర్ వైస్ ప్రెసిడెంట్‌లు తియ్యగూర వినోద్‌రెడ్డి, వెల్లపు శివ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ అన్నపురెడ్డి భరత్‌రెడ్డి, ఈసీ మెంబర్స్ పి. సాహిత్, యూత్ కమిటీ మెంబర్లు మామిడి అరుణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

నెహ్రూనగర్: ప్రజలు తమ నివాసాలతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. అప్పుడే స్వచ్ఛ గుంటూరు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, నగరాలులోని నవీన స్కూల్ వద్ద, లక్ష్మీపురంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, బి.రామాంజనేయులు, జి.మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, కార్పొరేటర్లు, అధికారులు, విద్యార్థులతో కలెక్టర్ స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. భాగస్వామ్యం ఉంటేనే మెరుగైన పారిశుద్ధ్యం సాధ్యం అవుతుందన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ బాపూజీ స్ఫూర్తితో ఏటా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నగర పరిధిలో 15 రోజులపాటు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, పెన్షనర్స్‌ల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుంటూరు సాధనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో సిబ్బంది ప్రతిజ్ఞ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం సైమన్ తదితరులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరుల భాగస్వామ్యంతో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్, సీనియర్ డీపీఓ షేక్ షహబాజ్ హనూర్, డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఏడీఆర్ఎం సైమన్ తదితరులు

రేపు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికను ఈ నెల 19వ తేదీన గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెనాలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు సీహెచ్ పద్మాకర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ఇంటర్మీడియెట్ చదువుతూ 2006 జనవరి 1వ తేదీ తరువాత పుట్టిన వారు అర్హులని వివరించారు. ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన జనన ధ్రువీకరణ పత్రం, టెన్త్ మార్కుల జాబితాతో ఆసక్తి కలిగిన వారు హాజరు కావాలని సూచించారు.

సాగర్ చెక్‌పోస్ట్ వద్ద గోవా మద్యం పట్టివేత

1236 మద్యం ఫుల్ బాటిళ్లు, 72 బీర్ టిన్నులు స్వాధీనం



స్వాధీన పర్చుకున్న మద్యం, లారీ

విజయపురిసౌత్: ఆంధ్ర– తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నాగార్జునసాగర్ అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రూ.4,54,000 లక్షల విలువైన 1236 మద్యం ఫుల్ బాటిళ్లు, 72 బీర్ టిన్నులను స్వాధీన పరచుకున్నట్లు మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా వెల్లడించారు. మంగళవారం విజయపురి సౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాగార్జునసాగర్ పోలీస్ చెక్ పోస్ట్‌లో అనుమానాస్పదంగా ఉన్న దోస్తు అశోక్ లైలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా భారీగా గోవాకు చెందిన మద్యం పట్టుబడినట్లు తెలిపారు. నిందితులను పట్టుకొని విచారించగా మద్యాన్ని గోవా రాష్ట్రం నుంచి గుంటూరుకి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితుల నుంచి 1236 ఫుల్ బాటిల్స్ మద్యం, 72 బీరు కేసులు స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా అక్రమంగా బియ్యం, లిక్కర్, మైనింగ్ కి సంబంధించి రవాణా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లు సోమ్లా నాయక్, సోమయ్య, సిబ్బంది ఉన్నారు.

కుంకలగుంటలో ఉద్రిక్తత

- భారీ ఎత్తున పోలీసులతో నిఘా
- వినాయక నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ
- కొనసాగుతున్న 144 సెక్షన్



కుంకలగుంటలో పహరా కాస్తున్న పోలీస్ బలగాలు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంటలో వినాయక నిమజ్జనం సందర్భంగా స్వల్ప వాదులాట ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ కాస్తా రెండు సామాజిక వర్గాల మధ్య వివాదంగా మారింది. ఘర్షణకు దిగిన ఇరు సామాజిక వర్గాల వారు అధికార టీడీపీ చెందిన వారు కావడంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. దీంతో పల్నాడు జిల్లా ఎస్పి కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో మరో ఇద్దరు డీఎస్పీలు, సీఐ ఎం.రాంబాబుతో మరో ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, మరో 130 మంది వరకు పోలీస్ సిబ్బంది నిఘాలో మంగళవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. 144 సెక్షన్ కొనసాగిస్తున్నారు. రెండురోజుల క్రితం టీడీపీకి చెందిన ఒక సామాజికవర్గం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆ ఊరేగింపులో అదేపార్టీకి చెందిన మరొక సామాజిక వర్గానికి చెందిన యువకుడిపై దాడి జరిగినట్లు సమాచారం. దీంతో దాడిచేసిన సామాజికవర్గం వారి వినాయక నిమజ్జనం సోమవారం రాత్రి జరుగుతుండడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అత్యంత సమస్యాత్మక గ్రామం కావడంతో కలకలం రేపింది. దీంతో సుమారు 30 మందికి పైగా పోలీస్ బలగాలతో రూరల్ సీఐ ఎం.రాంబాబు, నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్‌లు హుటాహుటిన గ్రామానికి చేరుకొని అర్ధరాత్రి వరకు పోలీస్ సైరన్ మ్రోగిస్తూ కట్టడి చేశారు. దీంతో సోమవారం భారీ ఘర్షణకు తెరపడింది. మంగళవారం మరొక సామాజిక వర్గానికి చెందిన వారి వినాయక నిమజ్జనం కావడంతో తిరిగి ఘర్షణలకు దారితీస్తుందన్న ముందస్తు సమాచారం మేరకు పెద్దఎత్తున పోలీస్ బలగాలను మోహరింపచేసి కాపలా కాస్తున్నారు. ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. ఘర్షణకు దిగిన ఇరు సామాజికవర్గాల వారు అధికార టీడీపీకి చెందిన వారు కావడంతో ఆపార్టీ నేతలకు తలనొప్పిగా మారినట్లు సమాచారం.

సత్తా చాటిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు



విజేతలతో నిర్వాహకులు

మంగళగిరి: అమలాపురంలో ఈ నెల 14, 15వ తేదీలలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ మేరకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మంగళవారం తెలిపారు. 11వ ఆంధ్రప్రదేశ్ జూనియర్, సబ్ జూనియర్ మాస్టర్ మెన్, ఉమెన్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు ఓవరాల్ టీం చాంపియన్ షిప్ సాధించినట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో శ్రావణి ప్రథమ, జూనియర్ పోటీలలో ఎస్‌కే సాదియా ఆల్మాస్ ప్రథమ, ఎం. షామాన్ ద్వితీయ, ఎస్‌కె సబీనా తృతీయ, సీనియర్స్ విభాగంలో చంద్రిక ద్వితీయ, ఎస్‌కే సాదియా ఆల్మాస్ తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు కైవసం చేసుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను వారు అభినందించారు.

సత్తెనపల్లిలో వెల్లివిరిసిన మతసామరస్యం

- హిందూ–ముస్లింలు కలసి గణనాథుడికి పూజలు
- 22న నిమజ్జనానికి ఏర్పాట్లు



సత్తెనపల్లి వడ్డవల్లిలోని జెండాచెట్టు వీధిలో పూజలందుకున్న వినాయకుడు

సత్తెనపల్లి: మత సామరస్యం వెల్లి విరిసేలా హిందువులు, ముస్లింలు కలిసి వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం లోని వడ్డవల్లి 18వ వార్డు జండా చెట్టు వీధి సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముస్లింలు, హిందువులు కలిసి రూ.2.200 లక్షలతో హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని తెప్పించి పూజలు నిర్వహిస్తున్నారు. 17 రోజుల పాటు పూజలు నిర్వహించి ఈ నెల 22న నిమజ్జనం చేయనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా మండపం కమిటీ సభ్యులు షేక్ రోహిత్, గండేపల్లి వెంకట్రావు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం అందచేస్తున్న విశ్వకర్మ యోజన పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. విశ్వకర్మ డివైన్, స్వయంబు ఇంజినీరని కొనియాడారు. పురాణాలలో విశ్వకర్మ స్వర్గలోక సృష్టికర్తని, ప్రపంచానికి అసలైన సృష్టికర్తని, కలియుగంలో పాండవులకు మయసభ శిల్పిగా, దేవతలకు ఆయుధాలు తయారు చేశారన్నారు. ఆయన పంచాముఖుడని, ఆయన దేవాలయాలు మచిలీపట్నం, చిలకలూరిపేటలో ఉన్నాయన్నారు. విశ్వకర్మల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 18 వృత్తులవారు విశ్వకర్మ యోజన పథకాన్ని ఎం.ఎస్.ఎం.ఈ ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమలోని నైపుణ్యాన్ని అంతరించి పోకుండా భావితరాల వారికి అందేలా చూడాలన్నారు.